# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 03-11-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **2047 నాటికి అన్ని రంగాల్లోనూ అగ్రస్థానంలో నిలిచేలా రాష్ట్ర భవిష్యత్తును మార్చే కొత్త ప్రణాళిక రూపొందిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు.**

2. **రాష్ట్రంలో స్థలం ఉండి గృహాలు లేని పేదలకు తొలిదశలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టంచేశారు.**

3. **అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉచిత గ్యాస్ సిలిండర్లను అందిస్తామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.**

4. **తెలంగాణలో పత్తి కొనుగోళ్లలో తేమ శాతంపై సీసీఐ సడలింపు ఇస్తూ రైతులందరికీ కనీస మద్దతు ధర లభించేలా సహకరించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు.**

5. **రాష్ట్రంలోని నగరాల్లో నిర్మించే 100 గజాల్లోపు గృహాలకు 'ప్లాన్ మంజూరు' ప్రక్రియను మినహాయించేలా చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పి.నారాయణ పేర్కొన్నారు.**

==========================

రాష్ట్ర భవిష్యత్తును మార్చే కొత్త ప్రణాళిక తెస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. పది సూత్రాల ప్రణాళికతో 2047 నాటికి అన్ని రంగాల్లోనూ ముందుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మెట్రో రైలు, రహదారులు, నౌకాశ్రయాలు, పర్యాటకం, పరిశ్రమలు, అభివృద్ధి అంశాలపై విశాఖపట్నం కలెక్టరేట్‌లో ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. పేదరిక నిర్మూలన దిశగా వేగంగా ముందుకెళ్లాలని అధికారులకు సూచించారు. ఉద్యోగాల సృష్టి, కల్పన, నైపుణ్యాల పెరుగుదల, రైతు సాధికారత, ఆదాయం పెంపులో తొలి స్థానంలో నిలవాలని దిశానిర్దేశం చేశారు. ప్రపంచస్థాయి మౌలికవసతుల అభివృద్ధి, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ దిశగా కృషి కొనసాగాలని చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు.

-------------------------

విశాఖపట్నంలోని రుషికొండపై నిర్మించిన విలాసవంతమైన భవనాలను ఏ విధంగా ఉపయోగించాలో

త్వరలోనే నిర్ణయిస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసే పనులను ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించకూడదని ఆయన సూచించారు. రుషికొండపై గత ప్రభుత్వం నిర్మించిన భవనాలను మంత్రివర్గ సహచరులతో కలిసి ముఖ్యమంత్రి నిన్న పరిశీలించారు. ఈ సందర్భంగా చంద్రబాబునాయుడు మాట్లాడుతూ ప్రజాధనాన్ని స్వార్ధ అవసరాల కోసం దుర్వినియోగం చేయడం బాధాకరమన్నారు. ప్రజలు నమ్మకంతో తమకు అప్పగించిన బాధ్యతను ప్రజాప్రతినిధులు నెరవేర్చాలని సూచించారు. ఎంతటి ఎవరైనా చట్టం ముందు సమానమేనని ముఖ్యమంత్రి వివరిస్తూ...

(వాయిస్ 27సెకన్స్)

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో గత ప్రభుత్వం కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన వెయ్యీ 61 కోట్ల రూపాయల బకాయిలను కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చెల్లించామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖా మంత్రి బీసీ జనార్ధనరెడ్డి తెలిపారు. అనకాపల్లి జిల్లా పరవాడలో నిన్న జరిగిన గుంతలు లేని ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. 860 కోట్ల రూపాయలతో రాష్ట్రంలో రహదారుల మరమ్మతులు చేపడుతున్నామని వెల్లడించారు. రోడ్లు, భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి కాంతీలాల్ దండే మాట్లాడుతూ.. రాష్ట్రంలో 20 వేల కిలోమీటర్ల మేర రోడ్లు దెబ్బతిన్నట్టు గుర్తించామన్నారు. రెండు నెలల్లో మరమ్మతులు పూర్తిచేసి గుంతలు లేని రోడ్లుగా రూపొందిస్తామని తెలిపారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో గుంతలు పడిన రోడ్లకు మరమ్మతులు చేపట్టి రూపురేఖలు మారుస్తామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా సంబేపల్లిలో జిల్లా కలెక్టర్ సీహెచ్.శ్రీధర్‌తో కలిసి నిన్న ఆయన గుంతలు రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా గుంతలు లేని ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ప్రభుత్వానికి ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు.

---------------------------

రాష్ట్రంలో రహదారుల మరమ్మతులకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్ధసారధి చెప్పారు. ఏలూరు జిల్లా దెందులూరు మండలం గోపన్నపాలెం వద్ద.. జంగారెడ్డిగూడెం ఏలూరు రోడ్డులో గుంతల రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, దెందులూరు శాసనసభ్యులు చింతమనేని.ప్రభాకర్‌తో కలిసి మంత్రి నిన్న శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా పార్ధసారథి మాట్లాడుతూ రహదారుల మరమ్మతు పనులను సంక్రాంతి లోపు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఏలూరు జిల్లాలో 76 కోట్ల రూపాయలతో ఈ పనులు చేపట్టామని వెల్లడించారు.

---------------------------

గుంతలు రహిత ఆంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం గ్రామంలో గుంతలు రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి

కె పవన్ కల్యాణ్ నేతృత్వంలో రాష్ట్రాభివృద్ధికి నిరంతర కృషి జరుగుతోందని తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో స్థలం ఉండి గృహాలు లేని పేదలకు తొలిదశలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. సచివాలయంలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. రెండో దశలో స్థలం కూడా లేని వారిని గుర్తించి స్థలం కేటాయింపుతో పాటు ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. ఈ నెల 6వ తేదీ నుంచి క్షేత్రస్థాయిలో లబ్ధిదారుల గుర్తింపు ప్రారంభమవుతుందని, దీనికోసం ప్రత్యేకంగా ఒక యాప్‌ను రూపొందించామని వెల్లడించారు. 15 నుంచి 20 తేదీల మధ్య గ్రామసభల ద్వారా అర్హులైన వారిని గుర్తించి లబ్ధిదారుల జాబితాలు ఖరారు చేస్తామని పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.

---------------------------

నాగార్జున సాగర్ నుంచి శ్రీశైలం వరకు బోటు ప్రయాణాన్ని కార్తిక మాసం తొలిరోజున తెలంగాణ పర్యాటక శాఖ ప్రారంభించింది. దాదాపు 120 కిలోమీటర్ల దూరం ఉండే ఈ ప్రయాణానికి మొదటి రోజు రాష్ట్రంతోపాటు పరిసర ప్రాంతాల నుంచి కూడా పెద్ద ఎత్తున పర్యాటకులు తరలివచ్చారు. నాగార్జున సాగర్ నుంచి నందికొండ మీదుగా ఏలేశ్వరం, సలేశ్వరం, తూర్పు కనుమలు, నల్లమల అటవీ ప్రాంత అందాలను వీక్షించేలా లాంచీ ప్రయాణానికి పర్యాటక శాఖ శ్రీకారం చుట్టింది.

---------------------------

అర్హులైన ప్రతి మహిళకు దీపం-2 పథకం కింద గ్యాస్ సిలిండర్లను అందిస్తామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల  శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. తిరుపతిలో దీపం-2 పథకం కింద మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లను నిన్న ఆయన అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ..  మార్చి వరకు అర్హులందరూ గ్యాస్ సిలిండర్ ను బుక్ చేసుకోవచ్చని ఆయన తెలిపారు. మూడురోజుల్లోనే రాష్ట్రవ్యాప్తంగా 12 లక్షల మంది గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకున్నారని మంత్రి మనోహర్ పేర్కొంటూ..

వాయిస్ ( 31) సెకన్స్

---------------------------

తెలంగాణలో పత్తి కొనుగోళ్ల సందర్భంగా తేమ శాతంపై కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా..సీసీఐ సడలింపు ఇస్తూ రైతులందరికీ కనీస మద్దతు ధర లభించేలా సహకరించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. రాష్ట్రంలోని అన్ని కొనుగోలు కేంద్రాలను ఈ నెల 4వ తేదీ లోపు ప్రారంభించి పత్తిని కొనుగోలు చేయాలని ఆదేశించారు. సచివాలయంలో నిన్న ఆయన పత్తి కొనుగోళ్లపై అధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల వద్ద సీసీఐ అధికారులు అందుబాటులో ఉండి కొనుగోళ్లలో జాప్యాన్ని నివారించాలని సూచించారు. రైతులకు సకాలంలో నగదు చెల్లించాలన్నారు.

---------------------------

రాష్ట్రంలోని నగరాల్లో నిర్మించే 100 గజాల్లోపు గృహాలకు 'ప్లాన్ మంజూరు' ప్రక్రియను మినహాయించేలా చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. విశాఖ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి, పార్లమెంటు సభ్యులు ఎం.శ్రీభరత్‌తో కలిసి నిన్న ఆయన విశాఖ మహా నగర పాలక సంస్థ.. జీవీఎంసీ, విశాఖపట్నం మహానగర ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ..వీఎంఆర్‌డీఏ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ..

భవన నిర్మాణ అనుమతుల విధానాలు పరిశీలించి పేద, మధ్యతరగతి ప్రజలకు ఉపయుక్తంగా ఉండేలా నిర్ణయం తీసుకుంటామన్నారు. 300 గజాల్లోపు గృహాలకు సులభతరంగా ప్లాన్ వచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తామని తెలిపారు. అనంతరం వీఎంఆర్‌డీఏ ప్రాజెక్టుల పురోగతిపై ఆరా తీసి, పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు మంత్రి సూచించారు.

======================